www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 5 ఏప్రిల్ 2025

5

కాకినాడ



8 నుంచి స్పోకెన్ ఇంగ్లీష్ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 8వ తేదీ నుంచి కాకినాడ కచేరీపేట సుందరయ్య భవన్‌లో స్పోకెన్ ఇంగ్లీష్ ఉచిత శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజా సంఘాల నాయకులు కె.సత్తిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు 30 రోజులపాటు నిర్వహించే ఈ క్లాసులకు అన్ని వయసుల వారూ ఆహ్వానితులే అన్నారు. రిటైర్డ్ టీచర్ టి.విశ్వేశ్వరరావు సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులకు హాజరయ్యే వారు ముందుగా 9490300599 నెంబరుకు కాల్ చేసి తమ పేరు నమోదు చేయించుకోవాలని సత్తిరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

అంతిమ శ్వాస విడిచిన నాగాంజలి

- 12 రోజులు పాటు మృత్యువుతో పోరాటం
- నాటకీయ పరిణామాల నడుమ మృతదేహం తరలింపు
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి - సిపిఎం డిమాండ్



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

బొల్లినేని ఆసుపత్రిలో ఉద్యోగి లైంగిక వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఫార్మా విద్యార్థిని నాగాంజలి శుక్రవారం తుది శ్వాస విడిచింది. 12 రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఆమె చివరకు ప్రాణాలను కోల్పోయింది. నాగాంజలి మృతి తోటి విద్యార్థులు, ఆమె తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచేసింది.

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం గ్రామానికి చెందిన నాగాంజలి రాజమహేంద్రవరం సమీపంలోని మధురపూడి వద్ద విజన్ ఫార్మసీ కళాశాలలో ఫార్మాడి ఫైనలియర్ చదువుతోంది. రాజమహేంద్రవరంలోని కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తోంది. ఈ క్రమంలో బొల్లినేని ఉద్యోగి దీపక్ కన్ను ఆమెపై పడింది. ప్రేమ, పెళ్లి పేరుతో ఆమెను నమ్మించి వంచించాడు. లైంగిక దాడులకు పాల్పడ్డాడు. ఇది భరించలేని నాగాంజలి గత నెల 23న విబి 10 ఎమ్‌జి ఇంజక్షన్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి నుంచి అపస్మారక స్థితిలోనే ఉంది.వెంటనే గమనించిన సహచరులు ఆమెను ఐసియుకి తరలించి చికిత్స అందించారు.

విషయం తెలుసుకున్న ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాగాంజలి కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రి వద్ద ఆందోళనలు చేశారు. పోలీసులతో ఈ ఆందోళనకు అణచే ప్రయత్నం జరిగింది. ఎట్టకేలకు నాగాంజలి సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు దీపక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

ఈ ఘటన సోషల్ మీడియా, పత్రికల్లో వైరల్ కావడంతో కలెక్టర్ స్పందించారు. నాగాంజలి వైద్య పర్యవేక్షణకు ప్రభుత్వ వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ బృందం పర్యవేక్షించింది. గత నెల 30 వరకూ నిలకడగా ఉన్న నాగాంజలి ఆరోగ్యం క్రమంగా విషమించిందని వైద్యుల బృందం తెలిపింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆమె తుది శ్వాస విడిచింది.

ఆసుపత్రి వద్ద నాటకీయ పరిణామాలు

పోస్టుమార్టం కోసం నాగాంజలి మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సమయంలో అక్కడ నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. పోస్టు మార్టం కాకుండానే మృతురాలి తల్లిదండ్రులు, ఆమె దగ్గర బంధువులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీని వెనుక పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం ఒత్తిళ్లు ఉన్నాయని అనుమానాలు కలిగాయి. పోస్టుమార్టం అనంతరం నాగాంజలి మృతదేహాన్ని ఎవరికీ చూపించలేదు. అక్కడి చేరుకున్న తోటి విద్యార్థులు, సిపిఎం, సిపిఐ, ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ ఇతర ప్రజా సంఘాల నాయకులు కోరినా పోలీసులు అంగీకరించలేదు. మృతదేహాన్ని చూపించాలని అంబులెన్స్‌కు అడ్డుకున్న నాయకులను పోలీసులు పక్కకు నెట్టేసి అంబులెన్స్‌ను అక్కడ నుంచి హుటాహుటిన తరలించారు. ఈ ఘటనపై వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. మృతదేహాన్ని సైతం చూపించకుండా తరలించడం శోచనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి : సిపిఎం

ఫార్మా విద్యార్థి నాగాంజలి మృతి బాధాకరమని, ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్, డివైఎఫ్‌ఐ జిల్లా నాయకులు టి.రాజేష్ తదితరులతో కలిసి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో నాగాంజలి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. పోస్టుమార్టం అయ్యేవరకు అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోస్టు మార్టం కాకుండానే తల్లిదండ్రులు, బంధువులు వారి గ్రామానికి వెళ్లిపోయారని, దీని వెనుకు పోలీసులు, యంత్రాంగం ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానం కలుగుతుందన్నారు. మృతదేహాన్ని ఎవరికీ చూపించకుండా తరలించేయడం శోచనీయమన్నారు. నాగంజలి మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సూసైడ్ నోట్‌లో వెల్లడించిన విషయాలతో పాటు, సిసి టివి ఫుటేజీ, తోటి విద్యార్థులతో మాట్లాడి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో పాటూ కిమ్స్ యాజమాన్యం కూడా బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జోసఫ్, జ్యోతి, సిపిఎం నగర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై ఆందోళన



పోలీసుల తీరును నిరసిస్తూ సిపిఎం, సిపిఐ, ఐద్వా, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు, డివైఎఫ్‌ఐ ఇతర ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడారు. సిసి టివి ఫుటేజ్‌ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. నాగాంజలి ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తులసి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లావణ్య, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడిసునీల్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు, ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి రాజమ్మ, మంగ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు కృషి

ప్రజాశక్తి-కాకినాడ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

జిల్లాలో వెనకబడిన తరగతుల వర్గాలకు స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు బ్యాంకర్లు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి కోరారు. జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సంస్థ ద్వారా బిసి, ఇడబ్ల్యుఎస్, కాపు కార్పొరేషన్ కింద రుణాలు మంజూరుపై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బిసి కార్పొరేషన్, జిల్లా పరిషత్, బ్యాంకు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వెనకబడిన తరగతుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్వయం ఉపాధి పథకాల మంజూరుకు బ్యాంకర్లు చేపట్టవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి మాట్లాడుతూ స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు సంబంధించి గత మార్చి నెల 10నుంచి 25వ తేదీ వరకు లబ్ధిదారుల నుంచి సుమారు 57 వేల దరఖాస్తులు అందినట్లు తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్లు, జనరిక్ మెడికల్ షాపులు, ఎంఎస్‌ఎంఈ గ్రూపులకు, మేదర, కుమ్మరి, శాలివాహన వర్గాల వారికి ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా రుణాలు మంజూరు ప్రక్రియను ప్రారంభించనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా వివిధ మండలాల ఎంపిడిఒ, మున్సిపాలిటీల కమిషనర్ల లాగిన్ నుంచి బ్యాంకర్లకు అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, రుణాలు మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, బిసి కార్పొరేషన్ ఇడి ఎ.శ్రీనివాసరావు, జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, డిసిసిబి ఇఇఒ ఆర్‌వి.నరసింహారావు, ఎల్‌డిఎం సిహెచ్‌ఎస్‌వి.ప్రసాద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

బోట్ క్లబ్‌ను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్



బోట్ క్లబ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

నగరపాలక సంస్థ పరిధిలోని బోటు క్లబ్ పార్కును జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. బోటు క్లబ్ పార్కు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోట్ క్లబ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోట్ క్లబ్ పార్కు ఆధునికీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం కాకినాడ పట్టణం మూడో డివిజన్ సురేష్ నగర్‌లో కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కన్వర్టబుల్ ఇండోర్ స్టేడియాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఇండోర్ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట సిపిఒ పి.త్రినాథ్, క్రీడా అభివద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, కాకినాడ గరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ కామేశ్వరరావు, ఇఇ మాచిరాజు పాల్గొన్నారు.

కాకినాడ జిజిహెచ్‌ను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జిజిహెచ్)ను అభివృద్ధి చేసేందుకు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించారు. తాజాగా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం లోక్‌సభ జీరో అవర్లో కాకినాడ జిజిహెచ్ అభివృద్ధి గురించి ఆయన ప్రస్తావించారు. అనేక దశాబ్దాలుగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రాణదారంగా నిలవడంతో పాటు భవిష్యత్తు తరాలకు వైద్య నిపుణులను అందిస్తున్న రంగరాయ వైద్య కళాశాలకు బోధనాసుపత్రిగా పని చేస్తోందని ఆయన తెలిపారు. ఆసుపత్రిలో సాధారణ సేవలతో పాటు, కీలకమైన కార్డియాలజీ, అంకాలజీ, న్యూరో సర్జరీ వంటి ప్రత్యేక విభాగాలు ఉన్నప్పటికీ సిబ్బంది కొరత, ఆధునిక పరికరాల కొరత, సరైన వసతులు లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. గతంలో క్యాన్సర్ చికిత్సలో రాష్ట్రంలోనే అగ్రగామిగా పేరుగాంచిన కాకినాడ ఆసుపత్రి నేడు వసతుల లేమితో రోగులకు ఆధునిక వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కాకినాడ జిజిహెచ్‌ను ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన కింద అభివృద్ధి చేయడంతో పాటు ఆసుపత్రిని సంపూర్ణ క్యాన్సర్ చికిత్స కేంద్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

పిఠాపురంపై మంత్రి పవన్ ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-పిఠాపురం



మహిళలతో మాట్లాడుతున్న ఎంఎల్‌సి నాగబాబు

పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎప్పటికీ ప్రత్యేక దృష్టి సారిస్తారని ఎంఎల్‌సి కొణిదెల నాగబాబు అన్నారు. గతంలో పవన్ కళ్యాణ్ పట్టణంలోని పర్యటించిన సందర్భంలో రథాలపేట వాసులు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఇళ్ల పట్టాల సమస్యను తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఆయన ఆదేశాల మేరకు 15 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి సిద్ధం చేసిన పట్టాలను ఎంఎల్‌సి నాగబాబు శుక్రవారం అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమీకృత బాలికల వసతి గృహంలో రూ.36.5 లక్షల వ్యయంతో బాలికలు విశ్రాంతి తీసుకునే గదుల ఆధునీకరణతో పాటు సౌకర్యాలు మెరుగు పరిచారు. నూతన వసతి గదులను నాగబాబు ప్రారంభించారు. వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలు, సమస్యలపై బాలికలను ఆరా తీశారు. పాదగయ క్షేత్రం వద్ద బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. జగ్గయ్య చెరువు కాలనీలో మహిళలతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట శాసన మండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ కుమార్, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, జనసేన పార్టీ సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాసరావు, కాకినాడ జిల్లా కలెక్టర్ షన్‌మోహన్ సగిలి, మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు, డాక్టర్ పంచకర్ల సందీప్, మురాలశెట్టి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రాజశేఖర్

రబీ పంటకు సంబంధించి ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవాలని ఎపి కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. తాళ్లరేవు ప్రజా సంఘాల భవనంలో జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ అధ్యక్షతన కౌలు రైతుల మండల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని ధాన్యం కొనుగోలుకు సంబంధించిన మెటీరియల్ సిద్ధం చేయాలని, ధాన్యం కల్లాల వద్దకు వెళ్లి శాంపుల్స్ తీసుకొని రైతులకు నష్టం లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. మిల్లర్ల దోపిడీని అరికట్టాలని కొత్త సంచులు రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పాలెపు ఈశ్వరరావు, దడాల వెంకటేశ్వరరావు, పితాని సత్యనారాయణ, ఇల్ల మహేశ్వరరావు, అడపా జాన్ ప్రసాద్, పంచగళ్ల రామకృష్ణ, దున్న శ్రీను రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా సభలకు తరలిన సిపిఎం శ్రేణులు


ప్రజాశక్తి - సామర్లకోట



ఆలిండియా సభలకు తరలి వెళుతున్న పార్టీ నాయకులు

సిపిఎం అఖిల భారత మహాసభల బహిరంగ సభలో పాల్గొనేందుకు నగరానికి చెందిన సిపిఎం శ్రేణులు రైలులో మధురై బయల్దేరి వెళ్లారు. శుక్రవారం సాయంత్రం పెద్దాపురం, సామర్లకోట ప్రాంతాలకు చెందిన పార్టీ శ్రేణులు సామర్లకోట రైల్వేస్టేషన్ నుంచి సుమారు పది మంది సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. ఈ నెల 6న మధురైలో జరిగే ఆలిండియా సభలు, భారీ బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యరకమంలో పార్టీ నాయకులు డి.క్రాంతికుమార్, డి.రాజా, రమేష్, కార్యకర్తలు బాలం హరిబాబు, సత్తిబాబు, అరుణ్, పీడీ ప్రసాద్, జగదీష్ తదితరులు న్నారు.

కార్టూ'నిజం'



అసైన్డ్ భూముల్లో మట్టి తరలింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు



విలేకరులతో మాట్లాడుతున్న లబ్ధిదారులు

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ సూరేడు దంప ప్రాంతంలో ప్రభుత్వం దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూముల్లో మట్టిని కొందరు తరలించుకు పోతున్నారని లబ్ధిదారులు కోరంగి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో కలిసి భూముల్లో మట్టిని తరలిస్తున్న యంత్రాలను, ట్రాక్టర్లను నిలుపుదల చేశారు. అనంతరం లబ్ధిదారుల వారసులు పెనుమాల బాబా నరసింహారెడ్డి, కన్నీడి వెంకటరమణ, పెనుమాల ఈశ్వరి విలేకరులతో మాట్లాడారు. 1975లో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ దంప ప్రాంతంలో ఆత్రేయ పాయను ఆనుకుని ఉన్న సర్వేనెంబర్ 250/2ఎ, 2బి, 2సిలలో ముగ్గురు లబ్ధిదారులకు సుమారు పది ఎకరాలు అసైన్డ్ భూమి ఇచ్చి, అనంతరం డి ఫామ్ పట్టాలిచ్చారని తెలిపారు. ఆ భూముల్లో గత 8 ఏళ్ల క్రితం ఆత్రేయ పాయ డ్రెడ్జింగ్ సమయంలో తమ భూముల్లో ప్రభుత్వం మట్టి వేసిందన్నారు. అనంతరం కోరంగి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్ఐ ఎసత్యనారాయణ తెలిపారు. కాశి లక్ష్మణస్వామి, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, జక్కల ప్రసాద్ బాబు, కుసుమ శ్రీనివాస్, వాకపల్లి చిరంజీవి, రొక్కం లోవరాజు రాజు బాబు, దుప్పి అదృష్ట దీపుడు, న్యాయవాది ఎడ్ల కుటుంబరావు పాల్గొన్నారు.



ఎంఎల్ఎ చినరాజప్పకు వినతిపత్రం అందిస్తున్న గిరీష్ కుటుంబం

న్యాయం చేయాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణం బలుసుల పేటకు చెందిన ఆలపు గిరీష్ కుటుంబం పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పకు విన్నవించుకున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఈ పార్టీ నాయకుల ప్రోద్బలంతో తన తమ్ముడు ఆలపు గిరీష్‌పై తప్పుడు కేసులు పెట్టి, గిరీష్ మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలపు ప్రవీణ్ కుమార్, కుటుంబ సభ్యులు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పను అచ్చంపేట నివాసంలో కలిసి శుక్రవారం వినతిపత్రం అందచేశారు. నిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఎంఎల్ఎను కోరారు.

ఇకపై స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిల్లా కేంద్రంలో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయని కాకినాడ అర్బన్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఆర్‌వి.రామారావు తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం జిల్లా కేంద్రాలలో ఈ స్లాట్ బుకింగ్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎప్పటిలా ఆఫ్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని అన్నారు. కక్షిదారులు తేదీ, సమయం ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని నిర్ధేశించిన సమయానికి వస్తే అర గంటలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యి, ఒరిజినల్ దస్తావేజులు ఇస్తారన్నారు. బుక్ చేసుకున్న సమయానికి కక్షిదారులు రాలేకపోతే అదే రోజున కార్యాలయ పని వేళల్లో వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చునని అన్నారు. అదే స్లాట్ బుకింగ్ మరుసటిరోజు ఉపయోగించుకోవడానికి రూ.200 చలనా కట్టి పునరుద్ధరణ చేసుకోవచ్చునన్నారు. ఈ స్లాట్ బుకింగ్ ద్వారా కక్షిదారులకు వేచి ఉండే సమయం ఆదా అవుతుందన్నారు. మిగిలిన సేవలు యథాతథంగా జరుగుతాయని తెలిపారు.

మరిడమ్మను దర్శించుకున్న ఆర్‌డిఒ శ్రీరమణి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని శుక్రవారం ఆర్‌డిఒఓ కె.శ్రీరమణి దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆసాదులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పూజారి ఐవి.ప్రసాద్ శర్మ, వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, ఆశాధులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ పాల్గొన్నారు.

ఆక్వా జోన్ల ఏర్పాటుకు గ్రామ సభలు

ప్రజాశక్తి-కాజులూరు, కరప

కాజులూరు మండలంలో ఆక్వా జోన్లు ఏర్పాటుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల మత్స్యశాఖ సహాయ అధికారి సుహాసిని తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ఈ నెల 7 నుంచి 11 వ తారీకు వరకు ఆక్వా జోన్లు ఏర్పాటుపై గ్రామ సభల వివరాలు వెల్లడించారు. కాజులూరు, పల్లిపాలెం, కోలంక, ఉప్పుమిల్లి, మంజేరు, నామవానిపాలెం, ఆండ్రంగి, దుగ్గుదుర్రు, కుయ్యేరు, శీల, పెనుమల్ల, తనుమల్ల, ఆర్యవటం, ఐతపూడి, గొల్లపాలెం గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని తెలిపారు. నాన్ ఆక్వా జోన్‌లోని చెరువుల యజమానులు గ్రామ సభలకు హాజరై తమ చెరువులకు సంబంధించి ధ్రువపత్రాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, సురేంద్ర పాల్గొన్నారు. **కరప** మండలంలోని వివిధ గ్రామాల్లో ఆక్వా జోన్ల ఏర్పాట్లకు గ్రామ సభలో నిర్వహిస్తున్నట్లు మత్స్య శాఖ అధికారులు ఆర్.నూకరాజు, కె.మధుబాబు తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు అరటకట్ల, జెడ్.భావవరం, కొరిపిల్లి, వేములవాడ, కరప, వేళంగి, కూరాడ, చిన్నమామిడాడ, యండమూరు, ఉప్పలంక, పెనుగుదురు, నడకుదురు, సిరిపురం, పెద్దాపురంపాడు, కొంగోడు, పాతర్లగడ్డలో సభలు నిర్వహిస్తామన్నారు.



చెరువు ఆధునికీకరణ పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి గొల్లపల్లి బుజ్జి

ఉపాధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని మర్రివీడు, జె.అన్నవరం తూర్పు లక్ష్మీపురం, రమణయ్యపేటలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పశువుల తొట్ల నిర్మాణం, చెరువుల ఆధునికీకరణ పనులకు ఎంపిపి గొల్లపల్లి బుజ్జి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతరం మర్రివీడులో ధాన్యం తేమ కొలిచే యంత్రం, లింగంపర్తి, సిరిపురం, ఎర్రవరం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, ఆయా గ్రామ సర్పంచులు, ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ, వ్యవసాయ అధికారి బి.జ్యోతి, ఎపిఒ బి.సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు మోషే, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కుమార్తె వరసైన యువతిపై అత్యాచారం

ప్రజాశక్తి-కరప

వేళంగి గ్రామానికి చెందిన ఒక కామాంధుడు కూతురు వరసైన యువతిపై అత్యాచారం చేసినట్లు అతడి భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.సునీత తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వేళంగి గ్రామానికి చెందిన ఒక మహిళకు వివాహం అయ్యింది. ఆమె అక్క చనిపోవడంతో ఆమె కుమార్తెను ఇంటిలో ఉంచి పెంచుకుంటోంది. ఈ నెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహిళ భర్త యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. యువతి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి తలుపు కొట్టగా తలుపు తెరిచి అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో నిందితుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల స్వాధీనం : ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అనధికారంగా మద్యం విక్రయాలు చేస్తున్న గూడాల గ్రామానికి చెందిన కొమ్ములు వీరబాబు, సాకురు గ్రామంకి చెందిన బొక్కా నరసింహమూర్తి అనే వ్యక్తుల నుంచి ఒక్కొక్కరి వద్ద 4 సీసాల చొప్పున మొత్తం 8 మద్యం సీసాలను స్వాధీన పరుచుకుని ఇరువురిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. అలాగే అమలాపురం మండలం బండారులంక గ్రామానికి చెందిన దొమ్మేటి వెంకట ప్రవీణ్‌ను అమలాపురం మండల తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు అమలాపురం ఎక్సైజ్ ఎస్ఐ విటివివి.సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారులో రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం అల్లూరి గ్రామానికి చెందిన బాడవుల కేదార మణిక్యం (21) రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి గురువారం రాత్రి ప్రత్తిపాడు మండలం ధర్మవరం వెళ్లి తిరిగి వస్తుండగా గండేపల్లి గ్రామ శివారున మరో బైకు ఢీకొనడంతో మాణిక్యం తీవ్రంగా గాయపడగా జిఎస్ఎల్ ఇసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. బైకుపై ప్రయాణిస్తున్న మరో వ్యక్తి విష్ణువర్ధన్ గాయాలతో బయటపడ్డాడు. విష్ణువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ శివనాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాగాంజలి మృతి బాధాకరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

బొల్లినేని ఆసుపత్రిలో ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి 12 రోజులు మృత్యువుతో పోరాడి మరణించడం ఎంతో విచారకరమని వైసిపి ఉమ్మడి గోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇన్‌ఛార్జి జమ్మలమడక నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక గైగోలుపాడు నివాసం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిందితుడు దీపక్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నిందితుడు అధికార పార్టీ ఎంఎల్ఎ బంధువైనంత మాత్రాన నేరస్తుడు కాకుండా పోడని చెప్పారు. దీనికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. పోలవరం వచ్చిన సిఎం చంద్రబాబు రాజమండ్రి ఆసుపత్రిలో ఉన్న బాధితురాలిని పరామర్శించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆడపిల్లల జోలికి వస్తే తోలు తీస్తానన్న పవన్ కళ్యాణ్ దీనిపై స్పందించకపోవడం విచారకరమన్నారు.

మరిడమ్మ ఆలయం వద్ద చలివేంద్రం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయ వద్ద శుక్రవారం మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు. ప్రస్తుత ఎండలను దష్టిలో పెట్టుకుని దేవస్థానం తరుపున దీనిని ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, సిబ్బంది ఎస్ రమణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రణాళిక

ప్రజాశక్తి - రామచంద్రపురం

'గోదావరి చెం త ఉన్న తాగునీటి చింత' అన్న శీర్షిక శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథ నానికి ఎంపిడిఒ నందమూరి శ్రీనివాస్ స్పందించారు. ఆయన మాట్లా డుతూ మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండటంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. దీనిపై నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

55 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కూళ్ల గ్రామ పంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ నాగేశ్వరరావు ప్రారంభిం చారు. ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి చే ఏర్పాటుచేసిన ఈ శిబిరం లో 55 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారిని ఆపరేషన్ల నిమిత్తం తరలించారు.

ప్రభుత్వ పాఠశాలలో స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి -మామిడికుదురు

గోగన్నమఠంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు శుక్రవారం దృష్టి సారించారు. ఎంఇఒ-2 మోకా వెంకన్న బాబు ఆధ్వర్యంలో ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం భావిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యా యులు ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించా లని ప్రచారం నిర్వహించారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

వేసవిలో తాగునీటి ఎద్దడి ప్రాంతాలను గ్రామంలో గుర్తించి ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని అందిస్తున్నట్టు సర్పంచ్ కుంచే బుల్లియ్య(బాబాయ్) తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడి ప్రాంతాలైన బెస్తాయిపేట,పెద చెరువు ప్రాంత ప్రజలకు శుక్రవారం వాటర్ ట్యాంకర్ ద్వారా సర్పంచ్ బుల్లియ్య ఎంపిడిఒ పిఆర్‌సి.రాజ్ కుమార్ లు అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి డి.బాల బాలాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణ పరిధిలోని పలు ప్రభుత్వశాఖల భవనాలను ఎంఎల్సి కె.నాగబాబు శుక్రవారం ప్రారంభించారు. తొలుత కలెక్టర్ షాన్‌మోహన్ సగిలితో కలిసి ఎంఎల్సి నాగబాబు ఈ భవనాలను ఎంఎల్సి పిడుగు హరిప్రసాద్, ఎపి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం రూ.65.24 లక్షలతో పునర్నిర్మాణం చేసిన మంచి నీటి సరఫరా పథకం, రూ.17 లక్షలతో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్మ లేకపోవడంతో టిడిపి శ్రేణులు జై వర్మ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి బిందు మాధవ్, పాడా పీడీ చైత్ర వర్షిణి, తహశీల్దార్ కెడిపి.సత్యనారాయణ, ఎంపిడిఒ స్వప్న, కమిషనర్ కనకారావు, డాక్టర్ అమ్మిరాజు వివిధ శాఖల అధికారులు జనసేన నాయకులు బస్వా చిట్టిబాబు, గరగ తాతాజీ, కదారి తమ్మయ్యనాయుడు, పట్టణ టిడిపి అధ్యక్షుడు సుబ్బారావు, పలువురు టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్సి నాగబాబు

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -పెద్దాపురం, సామర్లకోట

పెద్దాపురం మండల పరిధిలో బిసి, కాపు కార్పొరేషన్లు, ఇతర కులాలకు సంబంధించి బ్యాంకుల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం ఎంపిడిఒ డి.శ్రీలలిత అధ్యక్షతన బ్యాంకర్ల ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిధిలోని ఆనూరు, చదలాడ, చినబ్రహ్మదేవం, గోరింట, జెతిమ్మాపురం, కొండపల్లి, ఆర్‌బి.పట్నం, ఆర్‌బి.కొత్తూరు, సిరివాడ, తాటిపర్తి, వడ్లమూరు, వాలుతిమ్మాపురం గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు వివిధ బ్యాంకుల అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. **సామర్లకోట** మున్సిపాలిటీ పరిధిలో బిసి సామాజిక వర్గానికి సంబంధించి నిర్వహించిన సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు 700 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. సామర్లకోట టిటిడిసి శిక్షణ కేంద్రంలో శుక్రవారం మున్సిపల్ మేనేజర్ కనకారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 8 బ్యాంకులకు చెందిన అధికారులు పాల్గొని దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ రుణాలకు మొత్తం 920 దరఖాస్తులు రాగా మొదటి విడతగా 37 యూనిట్లు అందించినట్టు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. అనంతరం మంజూరయ్యే రుణాలకు హాజరైన 700 మంది దరఖాస్తుదారుల నుంచే లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలను అందిస్తామని తెలిపారు. బ్యాంకులకు చెందిన మేనేజర్లు, వందలాది సంఖ్యలో దరఖాస్తుదారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్లు, డ్రైయినేజీలు ప్రారంభం

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని మురారి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో శుక్రవారం జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సిసి రోడ్లు, డ్రెయిన్లను ప్రారంభించారు. తొలుత ఎన్‌టిఆర్, కందుల కొండయ్య దొర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తమ స్కూల్‌కు రోడ్లు వేయించినందుకు ఎంఎల్ఎ నెహ్రూకు స్కూల్ విద్యార్థులు థాంక్యూ ఎంఎల్ఎ సార్ అనే ప్లకార్డులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ అధికారులందరినీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నెహ్రూ మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల కాలంలోనే రూ.25 కోట్లతో నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ జాస్తి వసంత్, పోతుల మోహనరావు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు, సుంకవిల్లి రాజు, బొల్లం రెడ్డి రామకృష్ణ, సుంకవిల్లి రమేష్, కురుకూరి చౌదరి, బలిరెడ్డి గంగరాజు, తెలగా రెడ్డి భద్రరావు, కొల్లి త్రిమూర్తులు, దిడ్డి చిన్నశ్రీను, రామకుర్తి నరసింహ, బోండా శ్రీనుబాబు, గొల్లవిల్లి అప్పలరాజు, సింగలూరి రామ్‌దీప్, పంచాయతీరాజ్ డిఇ ఉమా శంకర్, జెఇ నారాయణమూర్తి, ఎంపిడిఒ నాతి బుజ్జి, తహశీల్దారు శ్రీనివాస్ పాల్గొన్నారు.



అధికారులను సత్కరించి జ్ఞాపికలు అందిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

కోటనందూరులో క్రైస్తవుల శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-కోటనందూరు

మండల కేంద్రమైన కోటనందూరులో శుక్రవారం పాస్టర్లు, క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ పగడాల మరణించి వారం రోజులు గడుస్తున్నప్పటికీ పోస్టుమార్టం రిపోర్ట్ ఎందుకు బయట పెట్టలేదని, ఆయన మరణం క్రైస్తవులకు ఎన్నో అనుమానాలు ఉన్నాయని, పోలీసు వీటన్నిటి పైన సమగ్రమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్, తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దారు టి.సుభాష్, ఎస్ఐ టి.రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీలో పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు బి.సంతోష్ కుమార్, సెక్రెటరీ రాజు, పాస్టర్ గాబ్రియేలు, మరిడియా, చిన్ని, సామ్యేల్ రాజ్, ప్రసాద్ పాల్గొన్నారు.

నన్నయలో ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ మాట్లాడుతూ, జగ్జీవన్‌రామ్ భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో కీలక భూమిక పోషించారని, అస్పృశ్యత నిర్మూలన కోసం ఆయన చేసిన కృషి భారతీయ సమాజాన్ని సమానత్వం వైపు నడిపించిందని తెలిపారు. విద్యా రంగంలో ఆయన అందించిన సేవలు, సమాజంలోని అణగారిన వర్గాల అభివృద్ధికి ఆయన చేపట్టిన సంస్కరణలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని ఆమె తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ ఎం.పోచయ్య, డాక్టర్ ఎం.నాని బాబు, డాక్టర్ హారిక, డాక్టర్ మధు కుమార్, డాక్టర్ శ్రీరామరాజు, మొహమ్మద్ నదీమ్, డాక్టర్ హరి బాబు, డాక్టర్ గోపి, డాక్టర్ శ్రీదేవి, రాధా మాధవి పాల్గొన్నారు.

పెద్దాపురం డిజిటల్ లైటింగ్ బోర్డు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కొత్తపేట గుర్రాల సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐ లవ్ పెద్దాపురం డిజిటల్ లైటింగ్ బోర్డును శుక్రవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా దీనిని ఏర్పాటు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ తుమ్మల బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రంధి సత్యనారాయణ, తూతిక రాజు, కొరుపూరు రాజు, బొడ్డు ఉదయ్, జనసేన పట్టణ అధ్యక్షుడు పొలమరశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

విఒలు బాధ్యతగా పని చేయాలి

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

విఒఎలు బాధ్యతాయుతంగా పని చేసి వార్షిక అప్పులు జీవనోపాధి యాక్షన్ ప్లాన్ అమలు చేసే విధంగా కృషి చేయాలని డిఆర్‌డిఎ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కొత్తపల్లి మహిళా సమాఖ్య కార్యాలయంలో విఒఎలు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరో తేదీ నుంచి సంఘాల్లో ఉన్న సభ్యులకు ఎ స్లిప్ వార్షిక అప్పులు, జీవనోపాధి యాక్షన్ ప్లాన్ గురించి తెలపాలన్నారు. ఉప్పాడలో ఉన్న మార్ట్ డెవలప్మెంట్ విఒఎల బాధ్యతని తెలిపారు. మార్ట్‌లో సరుకుల కొనుగోలు ప్రతి విఒఎ బాధ్యతగా చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎం జిలాని, డిపిఎం బాబూరావు, కేశవరావు, వెంకటేశ్వరరావు, ఎపిఎం తవుడు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-కిర్లంపూడి

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి డాక్టర్స్ వింగ్ అధ్యక్షులుగా నియమితులైన సూరాబత్తుల శ్రీనివాస్, వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును శాలువాతో సత్కరించారు. గిరిబాబు నూతనంగా నియమితులైన శ్రీనివాస్‌ను శాలువ తో సత్కరించి గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు పడుతున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే విధంగా పని చేయాలన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

నెలాఖరులోగా పన్నుల చెల్లింపుపై రాయితీ

ప్రజాశక్తి - పెద్దాపురం

2025-26 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన పన్నులు ఈ నెల 30వ తేదీ లోగా పూర్తిగా చెల్లిస్తే వారికి 5 శాతం పన్ను రాయితీ కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులు డిమాండ్ నోటీసులు కోసం ఎదురు చూడకుండా ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించి రాయితీ పొందవచ్చున్నారు. పన్ను డిమాండ్ నోటీసులు ఆన్‌లైన్‌లో విడుదలయ్యాక ఇఆర్‌పి ద్వారా పన్ను చెల్లింపు ఆప్షన్ వస్తుందని, ఈ నెల 6వ తేదీ నుండి ఈ పన్ను చెల్లింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఎంఎల్‌సి నాగబాబును కలిసిన నానాజీ

ప్రజాశక్తి -కరప

ఎంఎల్‌సి కొణిదెల నాగబాబును కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ శుక్రవారం కలిశారు. ఎంఎల్‌సి నాగబాబు పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించి వచ్చిన సందర్భంగా పిఠాపురంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి కప్పి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.

ఫోటో నాగబాబుకు అభినందనలు తెలుపుతున్న నానాజీ

కార్యదర్శులకు ఘన సత్కారం

ప్రజాశక్తి -కరప

కరప మండలంలో గ్రేడ్-5 కార్యదర్శులుగా పని చేస్తున్న ఆరుగురురికి గ్రేడ్-4 కార్యదర్శులుగా పదోన్నతి రావడంతో బదిలీపై వెళ్తున్న కార్యదర్శులను ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, ఇఒపిఆర్‌డి సలాది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కరప మండల పరిషత్ కార్యాలయంలో సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరిటెండెంట్ నరసింహం పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు. కార్యకర్తల సంఘం ప్రతినిధులు వీరభద్రరావు, బ్రహ్మానందంరావు, నిర్మలాదేవి, రామ్‌జీ, ఉమామహేశ్వరి, చంద్రకళ పాల్గొన్నారు.

పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -రౌతులపూడి

ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి అన్నారు. రౌతులపూడిలో వ్యవసాయ అధికారి ఈశ్వరరావు ఏర్పాటు చేసిన పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల రైతులకు మంజూరైన రాయితీ యంత్రాలను టిడిపి మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎంపిపి భాస్కర్ బాబు రైతులకు అందజేశారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి -కరప

కరప మండలం అరట్లకట్టలో చెత్త సేకరణపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, డ్వాక్రా మహిళలకు, గ్రామ ప్రజలకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించామని మండల పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. అరట్లకట్ట గ్రామంలో శుక్రవారం ఎస్‌సి కాలనీలో చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఐవిఆర్ సర్వే చేసి గ్రామాలలో పని తీరును అంచనా వేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామ్‌జీ పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని మల్లంపేటలో సినీ దర్శకనిర్మాత ఆర్.నారాయణ మూర్తి ఆర్థిక సాయంతో నిర్మించిన రామాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు హాజరై అన్నదాన స్వీకరించారు. సుమారు 3000 మంది యాత్రికులు అన్నదానానికి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

15 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి -కరప

మండల కేంద్రమైన కరపలోని సీలయ్య తోటలో రామాలయం పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గత నాలుగు రోజుల నుండి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వియత్నాం దేశం నుంచి తీసుకువచ్చిన రూ.3 లక్షలు విలువైన పాలరాతి విగ్రహాలను దాతలు లకమన వీర వెంకట సత్యనారాయణ, కుటుంబ సభ్యులు అందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 15 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గ్రామ సభలో 450 ఫిర్యాదులు

ప్రజాశక్తి- సామర్లకోట

వేట్లపాలెంలో మూడు నెలలుగా నిర్వహించిన రీ సర్వేలో భాగంగా, శుక్రవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభలో 450 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తహసీల్దార్ కె.చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో సుమారు 500 మంది పైగా రైతులు పాల్గొన్నారు. రైతుల నుంచి వినతులు స్వీకరించేందుకు మొత్తం 24 డెస్కులు ఏర్పాటు చేశారు. కాగా రైతుల భూముల రీసర్వేలో వెల్లడైన ఫలితాలపై అభ్యంతరాలను ఈ సందర్భంగా స్వీకరించారు. రైతుల నుంచి సుమారు 450 అభ్యంతరాలు, అప్పీళ్లు నమోదు కాగా శనివారం నుంచి వాటి పరిష్కారానికి గానూ సర్వేయర్లు, విఆర్‌ఒలతో క్షేత్ర స్థాయి సర్వేలు చేపడతారని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు యడ్ల శ్రీనివాస్, మండల సర్వేయర్, వీఆర్వోలు, సర్వేయర్ల బందం పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్చాలి

ప్రజాశక్తి-పిఠాపురం

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్చాలని వారి తల్లిదండ్రులను కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవ రావు ఒక ప్రకటనలో కోరారు. నూతన విద్యా విధానంలో భాగంగా అన్ని పోటీ పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో ఇతర రాష్ట్రాల విద్యార్థులతో పోటీపడేటట్లుగా సిలబస్‌లో కూడా అనేక మార్పులు చేశారని, ఇప్పటికే పాఠ్యపుస్తకాలను రెండో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అందజేశారని ఆయన తెలిపారు. ఈ నెల 1 నుండి సెకండ్ ఇయర్ క్లాసులు ప్రారంభించామన్నారు. ఒకపక్క ద్వితీయ సంవత్సరం తరగతులు బోధిస్తూ మరో పక్క పిఠాపురం పరిసర గ్రామాల్లో హైస్కూల్స్‌ను సందర్శించి 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ కళాశాల విశిష్టత అందులో సౌకర్యాలు వివరించి ప్రభుత్వ కళాశాలలో జాయిన్ చేసే కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మంగా లక్ష్మి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూనె మంగా లక్ష్మిని ఎంపిక చేసినట్లు గురువారం అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. పెద్దాపురం మండలం ఆర్‌బి కొత్తూరు గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు నూనె రామారావు సతీమణి మంగా లక్ష్మిని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేశారు.